
సాక్షి ఒడిశా

సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,69,857లు, బంగారం 1.5 మిల్లీగ్రాములు, వెండి 31.1 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



10వేల హెక్టార్లలో.. కాఫీ తోటల పెంపకం

- 8లో

బీజేడీ లీగల్‌సెల్ అధ్యక్షుడిగా రామనాథ మిశ్రా!

పర్లాకిమిడి: బీజేడీ లీగల్‌సెల్ జిల్లాల అధ్యక్షులను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఇందులో గజపతి జిల్లాకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామనాథ మిశ్రా పేరు ఉండటం గమనార్హం. సీనియర్ న్యాయవాది అయిన ఆయన.. 2022 అక్టోబర్ 30న పర్లాకిమిడిలో మృతి చెందారు. అయితే మిశ్రా మృతిచెందిన విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర నాయకత్వానికి తెలియదా అని స్థానికులు విస్తు పోతున్నారు.

న్యూస్‌రీల్

బీజేడీ జిల్లా అధ్యక్షుడిగా బ్రజనాయక్



బ్రజసుందర్ నాయక్

రాయగడ: బీజేడీ జిల్లా అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది, పార్టీ సీనియర్ నాయకుడు బ్రజసుందర్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి మానస్‌రంజన్ మంగరాజ్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బ్రజ నాయక్ బీజేడీ తరుపున మున్సిపాలిటీ ఎన్నికల్లో 8వ వార్డు నుంచి పోటీ చేసి, 2 పర్యాయాలు కౌన్సిలర్‌గా గెలుపొందారు. పార్టీలో కీలక సభ్యుడిగా వ్యవహరిస్తున్న ఆయన సేవలను గుర్తించిన అధిష్ఠానం.. జిల్లా అధ్యక్ష పదవి అప్పగించడంపై బీజేడీ శ్రేణులు, నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

నేడే పొల్లేరు జాతర



పొల్లేరు నదిపై ఏర్పాటు చేస్తున్న వంతెన

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మన్యం కొండకు బొడజాతర వన దేవతామూర్తులను ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో ఉన్న పొల్లేరు నదీ తీరానికి సోమవారం తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం రాష్ట్రప్రభుత్వం ఫ్లోటింగ్ వంతెన నిర్మించింది. నదిలో 200 మీటర్ల పొడవైన ఈ వంతెన సహకారంతో నాటు పడవ పై వనదేవతలు కన్నంరాజ్(శ్రీ కృష్ణుడు), బాల్‌రాజ్(అర్జునుడు), పోతురాజ్(భీముడు) అమ్మవారు ముత్యాలమ్మను తీసుకు వస్తారు. ఈ మేరకు చేపట్టిన ఏర్పాట్లను మల్కన్‌గిరి కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. జాతరకు ఒడిశాతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన దాదాపు 80వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తు చేపట్టారు.

పద్మపూర్‌లో గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: జిల్లాలోని ఖంబారిగుడలో పద్మపూర్ పోలీసులు శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బైకుపై గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 30 కిలోల గంజాయితో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేయడంతో పాటు సోమవారం ఉదయం కోర్టుకు తరలిస్తామని పోలీసులు వివరించారు.

ప్రవాస తెలుగు వారికి చేయూత



అగ్నిప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న రాతెస ప్రతినిధులు

భువనేశ్వర్: రాష్ట్రేతర ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగు వారి బాగోగుల పట్ల రాష్ట్రేతర తెలుగు సమాఖ్య(రాతెస) ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఈ మేరకు అస్సాం అగ్నిప్రమాద బాధితులకు విపత్తు సహాయం అందజేసింది. గౌహతిలోని ఘటాసిల్ ప్రాంతంలో ఇటీవల భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 60ఇళ్లు దగ్ధమయ్యాయి. బాధితుల్లో 56 తెలుగు కుటుంబాలు కావడంతో రాష్ట్రేతర తెలుగు సమాఖ్య సముచిత సాయానికి నడుం బిగించింది. దేశవ్యాప్తంగా విస్తరించిన రాతెస శాఖా కార్యవర్గం ఆర్థిక సాయానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చింది. పశ్చిమబెంగాల్ టిటాగఢ్ ప్రాంతానికి చెందిన సంఘం ప్రతినిధులు ఈ.వీరరాజు, టి.శివలింగం ప్రభావిత ప్రాంతాన్ని సందర్శించారు. రాతెస గౌహతి అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో బాధిత తెలుగు కుటుంబాలకు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. అక్కడి కార్యవర్గం శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి బాధితులను పరామర్శించడంతో పాటు చేయూత అందించామని రాతెస జాతీయశాఖ అధ్యక్షుడు రాళ్లపల్లి సుందరరావు తెలిపారు.

సంకల్పమే బలం



శబరి శ్రీక్షేత్రం వద్ద సైకిల్‌తో పర్యావరణ ప్రేమికుడు అజిత్ చౌదరి

- సామాజ హితాన్ని కోరుతూ సాహసయాత్రలు
- రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఢిల్లీ యువకుడి పాదయాత్ర
- పర్యావరణ పరిరక్షణపై కొరాపుట్ చేరుకున్న బీహార్ వాసి



సిమిలిగుడ వద్ద పాదయాత్రికుడు కిరణ్‌వర్మకు స్వాగతం పలుకుతున్న సునాబెడా మున్సిపల్ చైర్మన్ రాజేంద్రపాత్రో

కొరాపుట్: నిత్య జీవనంలో సమాజానికి ఏదో ఒక విధంగా సాయపడుతుంటాడు సగటు జీవి. అయితే కొద్దిమంది మాత్రం సామాజిక హితాన్నే జీవనంగా మార్చుకుంటారు. దీని కోసం ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా మొక్కవోని దీక్షతో ఎదుర్కొని, దేశవ్యాప్త యాత్రకు సిద్ధమయ్యారు. వివరాల్లోకి వెళ్తే... రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఢిల్లీకి చెందిన కిరణ్‌వర్మ నడుం బిగించాడు. ఈ మేరకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం సాయంత్రం కొరాపుట్ జిల్లా కేంద్రానికి చేరుకోగా.. స్థానిక యువత ఘన స్వాగతం పలికారు. కిరణవర్మ 2021 డిసెంబర్‌లో కేరళ లోని త్రివేండ్రం నుంచి పాదయాత్ర ప్రారంభించి, రక్తదానం చేయాలని ప్రచారం చేస్తున్నారు. రక్తం లేకుండా ఎవరూ చనిపోకూడదనే సంకల్పంతో ఈ ప్రచారం చేస్తున్నాడు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలను కలుపుతూ 21వేల కిలోమీటర్లు దూరం నడచి 2025 డిసెంబర్‌లో ఢిల్లీకి చేరుకోవాలనే లక్ష్యంతో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 11 రాష్ట్రాలు, 156 జిల్లాల్లో 11వేల కిలోమీటర్లు నడిచినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా



దమంజోడిలో రక్తదాన శిబిరం వద్ద అవగాహన కల్పిస్తున్న కిరణ్‌వర్మ

కొరాపుట్ జిల్లా సిమిలిగుడ వద్ద లీవ్ ఫర్ ఫాదర్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కిరణ్‌వర్మకు స్వాగతం పలికారు. సునాబెడా మున్సిపల్ చైర్మన్ రాజేంద్ర కుమార్ పాత్రో పాల్గొని, అభినందించారు. దమంజోడి పట్టణానికి చెందిన పాత్రికేయుడు అరుణ్ ఉజ్జి కుమారుడు అకాల మరణం నేపథ్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కిరణ్‌వర్మ హాజరై రక్తదానం ఆవశ్యకతపై ప్రసంగించారు. కార్యక్రమంలో లీవ్ ఫర్ ఫాదర్స్ సంస్థ ప్రతినిధి స్నిగ్ధారాణి మిశ్రా ఏర్పాట్లు చేశారు.

10వేల కిలోమీటర్ల సైకిల్‌యాత్ర

కొరాపుట్: పర్యావరణ పరిరక్షణ కోసం 10వేల కిలోమీటర్ల సైకిల్‌యాత్ర కొరాపుట్‌కు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని శబరి శ్రీక్షేత్రం సమీపంలో ఈ యాత్ర చేస్తున్న బీహార్ లోని బీర్‌పూర్‌కు చెందిన అజిత్‌కుమార్ చౌదరికి ఘన స్వాగతం లభించింది. ఈ ఏడాది జనవరి 19న అజిత్ సైకిల్‌యాత్ర ప్రారంభించారు. ఇప్పటి వరకు 2,200 కిలోమీటర్ల యాత్ర ముగిసింది. యూజ్ సైకిల్–సేవ్ ఎన్విరాన్‌మెంట్ నినాదంతో చేపట్టిన ఈ యాత్రలో భాగంగా ద్వాదశ జ్యోతిర్లింగాలు, చార్‌ధాం యాత్ర చేస్తానని తెలిపారు. ఇప్పటికే ఝార్ఖండ్‌లోని వైద్యనాథ్ జ్యోతిర్లింగం, పూరీ ధాం పూర్తి చేశానన్నారు. తన యాత్ర దాదాపు 25 రాష్ట్రాల్లో కొనసాగుతుందన్నారు. రోజూ రోడ్డు మార్గంలో 90 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నట్లు వివరించారు. అజిత్‌కు స్థానికులు ఆహారం, వసతి కల్పించి, సాయం అందించారు.

ఏఐసీసీ సమావేశాల్లో కొరాపుట్ నాయకులు



ప్లీనరీ వేదిక వద్ద అనుచరులతో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) సమావేశాల్లో కొరాపుట్ జిల్లాల కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయిపూర్‌లో జరుగున్న 85వ ప్లీనరీ సమావేశాల్లో పరిశీలకుడిగా కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క వ్యవహరిస్తున్నారు. రాష్ట్రం నుంచి సప్తగిరి ఒక్కరే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా గెలిచారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర వ్యవహారాల బాధ్యతలు అప్పగించింది. గత వారం రోజులుగా ఆయన అక్కడే ఉంటూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అలాగే కొరాపుట్ పార్లమెంటరీ పరిధిలోని కొరాపుట్, రాయగడ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున్న పార్టీ నాయకులు రాయిపూర్‌లో మకాం వేశారు. కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు మీనాక్షి బహినీపతి, మహిళా నాయకులు చర్చల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో అతిపిన్న వయస్కురాలైన



ప్రియాంక గాంధీతో ఏఐసీసీ సభ్యురాలు మానసా త్రిపాఠి

ఏఐసీసీ సభ్యురాలు నవరంగ్‌పూర్‌కు చెందిన మనసా త్రిపాఠి ఈ సమావేశాల్లో ప్రియాంకాగాంధీ సరసన పాల్గొన్నారు.

జయపురంలో జమ్మి జాతర



తకురాణితో నగర సంచారం చేస్తున్న పూజారి



పూజలందుకుంటున్న జమ్మి తకురాణి అమ్మవారు

జయపురం: పట్టణంలోని బంకమఠం ప్రాంతంలో జరిగిన జమ్మి జాతర(సిర్లి పండగ)లో భక్తులు పోటెత్తారు. సంప్రదాయంగా శివరాత్రి మరుసటి రోజు ప్రారంభమైన ఈ జాతర ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారు జమ్మి తకురాణిని రోజూ పట్టణంలోని వీధుల్లో పర్యటించి, ప్రతి ఇంటి నుంచి భోగం సేకరించారు. జమ్మి తకురాణికి పూజలు చేస్తే అంటు వ్యాధులు నయమవుతాయని ప్రజల విశ్వాసం. ఈ నేపథ్యంలో భక్తులు కొబ్బరికాయలు, అరటిపండ్లు, కొండచీపుర్లు, నెయ్యిలు సమర్పించారు. అలాగే చిన్నారులను అమ్మవారి వద్దకు పంపి, ఆశీర్వాదం పొందారు.

వేతనాలు పెంచాలని డిమాండ్

రాయగడ: ప్రభుత్వ పాఠశాలల్లో పైలట్ పథకం కింద ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజనం పథకంలో వంట కార్మికులుగా పని చేస్తున్న వారి వేతనాలు పెంచాలని దక్షిణ ఒడిశా పాచిక సహాయక మహాసంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా జిల్లాలోని పద్మపూర్ సమితిలో జగముండ పహడొ వద్ద ఆందోళన చేపట్టామని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి గమాంగొ తెలిపారు.

బొయిపరిగుడ కళాశాలకు రూ.కోటి నిధులు



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు, సిబ్బంది

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడలోని సహీద్ లక్ష్మణ్ నాయక్ ప్లస్2, ప్లస్3 డిగ్రీ కళాశాలల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో కళాశాల విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు. ఈనెల 3 నుంచి 5వరకు కొరాపుట్ జిల్లా పర్యటించిన ముఖ్యమంత్రి వ్యక్తిగత, 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ బొయిపరిగుడను సందర్శించారు. ఆ సమయంలో ప్లస్2, ప్లస్3 విద్యార్థులు ఆయనను కలిసి, తమ సమస్యలను విన్నవించారు. ఈ నేపథ్యంలో కళాశాల అభివృద్ధి ఆవశ్యకతను గుర్తించిన ఆయన.. సమస్యను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, అభివృద్ధి నిమిత్తం రూ.కోటి నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తూ ప్రకటన వెల్లడించింది. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల పరిచాలన కమిటీ అధ్యక్షుడు మనోజ్ మహాపాత్రో, ప్లస్2 కళాశాల అధ్యక్షుడు కుముద్‌చంద్ర మహారాణా, పూజారిగుడ సర్పంచ్ సత్య మాఝి, జిల్లా పరిషత్ సభ్యులు రాజేశ్వర మహరియ, విద్యార్థులు.. ముఖ్యమంత్రితోపాటు 5టీ కార్యదర్శి, కొరాపుట్ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీమంత్రి దివ్యశంకర్ మిశ్రాకు వివాహం

- ఇరువైపులా అతి కొద్దిమంది అతిథులకు మాత్రమే ఆహ్వానం



వధువుకు కుంకుమ దిద్దుతున్న దివ్యశంకర్ మిశ్రా



వివాహ వేదికపై దివ్యశంకర్‌తో ప్రియాంక అగస్తీ

కొరాపుట్: అధికార పార్టీ బీజూ జనతాదళ్ కొరాపుట్ జిల్లా పరిశీలకుడు, మాజీమంత్రి కెప్టెన్ దివ్యశంకర్ మిశ్రా(54) పునర్వివాహం చేసుకున్నారు. పూరీ సమీపంలోని ఓ రిసార్టులో ఈ వివాహం ఆదివారం జరిగింది. సంచలనాలకు మారు పేరైన దివ్యశంకర్.. ఈ వివాహంతో మరోసారి వార్తల్లో నిలిచారు. దివ్యశంకర్ ప్రస్తుతం కలహండి జిల్లా జునాఘడ్ విధానసభ స్థానం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. తొలుత నవీన్ క్యాబినెట్‌లో హోంశాఖ సహాయ మంత్రిగా ఉండేవారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉపాధ్యాయురాలు మమతా మెహర్ హత్య కేసులో దివ్యశంకర్ ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీంతో క్యాబినెట్ విస్తరణలో మంత్రి పదవిని నిలబెట్టుకోలేక పోయారు. అయితే ఇటీవల బీజేడీ అధిష్ఠానం ఆయనకు కొరాపుట్ జిల్లా బాధ్యతలు అప్పగించింది. మరోవైపు దివశంకర్ ద్వితీయ వివాహం చేసుకున్న ప్రియాంక అగస్తీకి కూడా ఇది ద్వితీయ వివాహమే. వీరిద్దరూ తమ గత వైవాహిక జీవితాలలో విడాకులు తీసుకున్నారు. దివ్యశంకర్ ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్‌గా పనిచేశారు. అనంతరం రాజకీయాల్లోకి వచ్చారు. గతంలో జయపట్నకు చెందిన మహిళతో వివాహం చేసుకున్న ఆయన.. వివిధ కారణాలతో ఆమెకు విడాకులు ఇచ్చారు. వీరి దాంపత్యంలో జన్మించిన కుమారుడు దుబాయ్‌లో చదువుతున్నట్లు సమాచారం.

టాటాలో సీనియర్ ఇంజినీర్..

దివ్యశంకర మిశ్రాను వివాహం చేసుకున్న ప్రియాంక అగసీకలహండి జిల్లాలోని గోలముండా మండలం డెకోటా గ్రామానికి చెందిన భవానీ అగస్తీ కుమార్తె. సోషల్ మీడియా ప్రొఫైల్ ప్రకారం టాటా పవర్‌లో సీనియర్ లీడ్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. ప్రియాంకకు కూడా ఇది రెండో వివాహం కాగా, గతంలో మానస్ పండా అనే వ్యక్తిని పెళ్లి చేసుకొని, విడాకులు తీసుకున్నారు. పూరీ జిల్లా పిప్పిలిలో జరిగిన ఈ వేడుకకు పరిమిత బంధువులు, సన్నిహితులు హాజరయ్యారు. పాస్‌లు ఉన్న వారిని మాత్రమే ప్రవేశానికి అనుమతించారు. గరిష్టంగా 60మంది అతిథులు మాత్రమే రాగా.. వీరిలో వరుడి తరపున 32మంది, వధువు వైపు నుంచి 28మంది పాల్గొన్నట్లు సమాచారం.

పేదలకు ఉచిత విద్య, వైద్యం

- నవురా బాప్టిస్ట్ క్రైస్తవ మహాసభలో తిరుపతి పాణిగ్రాహి



మాట్లాడుతున్న తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: జిల్లాలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఇంజినీరింగ్, వైద్య విద్యతో పాటు మెరుగైన వైద్యం ఉచితంగా అందిస్తానని హైటెక్ గ్రూప్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి ప్రకటించారు. జిల్లాలోని పారిడా పంచాయతీ జన్నిగుడ వద్ద ఆదివారం నిర్వహించిన నవరా బాప్టిస్ట్ క్రైస్తవ మహాసభ నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత లేని ఆదివాసీలు, క్రైస్తవులకు భువనేశ్వర్‌లోని తమ కళాశాలలో ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలలో ఉచిత ప్రవేశాలు కలిపిస్తానని తెలిపారు. దీనిని సద్వినియోగంచుకొని, ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇందులో భాగంగా మతపెద్దలు దైవ సందేశాన్ని వినిపించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం తిరుపతి పాణిగ్రహిని పాస్టర్లు గౌరవపూర్వకంగా సత్కరించారు. మహాసభకు లక్షమందికి పైగా క్రైస్తవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, గుమ్మా బ్లాక్ అధ్యక్షురాలు సునేమి మండళ్, గుసాని బ్లాక్ అధ్యక్షుడు ఎన్.వీ రాజు, ఆర్ఎంసీఎస్ అధ్యక్షుడు ఎస్.గజపతి రావు, కాశీనగర్ అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, గుసాని జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, మాజీ జెడ్పీటీసీ జేమ్స్ రైకా, మారుత్ పాలో, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు, నాయకులు, విశ్వాసులు

ఒడిశా సీఎస్‌గా ప్రదీప్‌కుమార్ జెనా



ప్రదీప్‌కుమార్ జెనా



సురేష్‌చంద్ర మహాపాత్రో



అను గర్గ్

- మార్చి 1న బాధ్యతల స్వీకరణ
- 28న సురేష్‌చంద్ర మహాపాత్రో ఉద్యోగ విరమణ
- ఓఈఆర్‌సీ చైర్మన్‌గా నియమించిన రాష్ట్రప్రభుత్వం

భువనేశ్వర్: రాష్ట్రప్రభుత్వం నూతన ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్ జెనాను నియమించింది. సాధారణ పరిపాలనా విభాగం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన మార్చి 1న బాధ్యతలు స్వీకరించనున్నారు. 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ప్రదీప్ జెనా.. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి(ఏసీఎస్), ప్రత్యేక సహాయ కమిషనర్, ఒడిశా విపత్తు నిర్వహణ అథారిటీ(ఓస్డమా) మేనేజింగ్ డైరెక్టర్ పదవులతో పాటు వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, ప్లానింగ్, కన్వర్జెన్స్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రధాన కార్యదర్శి సురేష్‌చంద్ర మహాపాత్ర పదవీకాలం ఈనెల 28న ముగియడంతో ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. 1964లో జన్మించిన ప్రదీప్‌కుమార్ జెనా.. 1989లో ఐఏఎస్ ఉత్తీర్ణత సాధించి, శిక్షణ అనంతరం 1991లో కలహండి జిల్లాలోని ధర్మగడ్ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా, జిల్లా మేయర్‌గా పనిచేశారు. అనంతరం కేంద్రపడా జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. 1999లో సూపర్ సైక్లోన్ విపత్కర పరిస్థితుల్లో కటక్ జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. విపత్తు తదనంతర సహాయక, పునరుద్ధరణ సత్వర కార్యాచరణతో అధికారిక ప్రసంశలతో విశేష ప్రజాదరణ పొందారు. విపత్తు నిర్వహణలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. సమర్థవంతమైన పరిపాలనా అధికారిగా, ప్రజాభిమానం కలిగిన వ్యక్తిగా ప్రత్యేక గుర్తింపు సాధించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ పదవిలో చాలామంది సుదూర నిర్వాసితులు థాయ్ రైతులకు విశేషమైన సహకారం అందించారు. అదే విధంగా కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రత్యేక సహాయ కమిషనర్ హోదాలో కీలకపాత్ర పోషించారు. 2017లో రాష్ట్ర అభివృద్ధి కమిషనర్‌గా, శ్రీమందిరం చీఫ్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేశారు.

అభివృద్ధి కమిషనర్‌గా అను గర్గ్..

ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి(ఏసీఎస్) అను గర్గ్ కొత్త అభివృద్ధి కమిషనర్‌గా నియమితులయ్యారు. ప్రదీప్‌జెనా పదోన్నతి పొందిన తర్వాత, ఆమె ఈ బాధ్యతలు చేపడతారు. అను గార్గ్ జలవనరుల కార్యదర్శితో పాటు డెవలప్‌మెంట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

సురేష్‌చంద్రకు కీలక బాధ్యతలు..

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విరామం పొందనున్న సురేష్‌చంద్ర మహాపాత్రొకు ఒడిశా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఓఈఆర్‌సీ) చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ హోదాలో బాధ్యతలు స్వీకరించిన నుంచి పదవీకాలం పరిగణిస్తారని పేర్కొన్నారు. సురేష్‌చంద్ర వరుసగా 2సార్లు 6నెలల చొప్పున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో కొనసాగేందుకు ప్రభుత్వం పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసింది. రెండో విడత పొడిగింపు పదవీకాలం ఫిబ్రవరి 28వ తేదీతో ముగుస్తుంది. సురేష్‌చంద్ర విద్యుత్ విభాగం కార్యదర్శిగా, ఓపీజీసీ, ఓహెచ్‌పీసీ, ఓటీపీసీఎల్, గ్రిడ్కో వంటి విద్యుత్ రంగ సంస్థల అధ్యక్షుడిగా సైతం గతంలో బాధ్యతలు నిర్వహించి, విశేష అనుభవం పొందారు. ఈ నేపథ్యంలో కీలక బాధ్యతలు అప్పగించడం విశేషం.

న్యూస్‌రీల్

ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

విజయనగరం : జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా గురాన అయ్యలు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా పి.విజయలక్ష్మి, కె.సుభాష్ చంద్రబోస్, బెల్లాన లక్ష్మి, కె.కృష్ణంరాజు ఎన్నికవగా.. కోశాధికారిగా నడిపిల్లి గురునాథ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.ఆదిలింగం, సంయుక్త కార్యదర్శులుగా వి.మల్లేశ్వరరావు, వి.వి.రమణ, జి.శ్రీనివాసరావు, డి.దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు పరిశీలికునిగా రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు బడేటి వెంకట్రామయ్య,రిటర్నింగ్ అధికారిగా ఎస్.జగన్నాధంనాయుడు వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గురాన అయ్యలు మాట్లాడుతూ జిల్లాను క్రీడలకు నిలయంగా మారుస్తామన్నారు. క్రీడల్లో రాణించే యువతకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఆ దిశగా ప్రోత్సాహమందిస్తామన్నారు. సమావేశంలో పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు హోం హెల్త్ కేర్‌లో శిక్షణ

విజయనగరం అర్బన్: గాయత్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ అండ్ మెడికల్ టెక్నాలజీ, సెంచూరియన్ యూనివర్సిటీ, స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ సంయుక్తంగా ఐదు నెలల హోం హెల్త్ కేర్ అసిస్టెంట్స్ కోర్సులో ప్రవేశాలకు దివ్యాంగుల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జీవీబీ జగదీష్ ఆదివారం తెలిపారు. పదో తరగతి చదివిన 17 నుంచి 35 ఏళ్ల లోపు వయసున్న నిరుద్యోగులైన శారీరక విభిన్న ప్రతిభావంతులు, తక్కువ వినికిడి లోపం ఉన్న వారు వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 8985953000 నంబరును సంప్రదించాలని సూచించారు.

నూతన కార్యవర్గం



ఎంపికైన బధిరుల నూతన కార్యవర్గం

విజయనగరం టౌన్: విజయనగరం జిల్లా బధిరుల అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా పడాల మహేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా ఎల్.సత్యన్నారాయణ, ఎన్ సాగిఅప్పలవర్మ, జి.శివకుమార్ ఎంపికయ్యారు. వీరితో పాటూ ప్రధాన కార్యదర్శిగా జి.గణపతి, కోశాధికారిగా మంగునాయుడు కళిరెడ్డి, మహిళా కార్యదర్శిగా జమ్ము ఆశాజ్యోతి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎంపికయ్యారు. అసోసియేషన్ అభివృద్ధికి తామంతా పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నిరంతర ప్రక్రియగా పుస్తకాల సేకరణ



దాత నుంచి పుస్తకాలను అందుకుంటున్న గ్రంథాలయ సేవా సంఘం ప్రతినిధులు

విజయనగరం అర్బన్: గ్రంథాలయాల కోసం పుస్తకాల సేకరణ నిరంతర ప్రక్రియగా 'పుస్తక హుండీ' పేరుతో చేపడుతున్నామని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కె.దయానంద్ అన్నారు. స్థానిక ఉడా కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు నుంచి సేకరించిన పుస్తకాలను ఆదివారం సంఘం సభ్యులు స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పుస్తక పఠనం పెంపొందించేందుకు గ్రంథాలయాలను ప్రజలకు చేరువ చేసేందుకు తమ సంఘం కృషి చేస్తుందని అన్నారు. ఇళ్లలో వృథాగా ఉన్న పుస్తకాలను అవసరమైన వారికి అందజేయాలన్న ఆలోచన తో పుస్తక హుండీ చేపడుతున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, మాజీ కార్యదర్శి ఆర్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ: ఇద్దరికి గాయాలు

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు వెంబడి ఆదివారం ఘనసర సెంటర్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. బైక్, స్కూటీ ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు.గాయాల పాలైన వారిని టెక్కలి, పర్లాకిమిడికి చెందిన వ్యక్తులుగా చెబుతున్నారు. గాయపడిన బాధితులకు స్థానికులు సపర్యలు చేసి ఆటోలో కొత్తూరు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

10వేల హెక్టార్లలో.. కాఫీ తోటల పెంపకం

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేష్‌చంద్ర మహాపాత్రో
- కొరాపుట్ జిల్లాలో సుడిగాలి పర్యటన



కాఫీ తోటలను సందర్శిస్తున్న సీఎస్ సురేష్ మహాపాత్రో, కలెక్టర్ అక్తార్, ఉన్నతాధికారులు



అప్పర్ కొలాబ్‌లో సంచరిస్తున్న సీఎస్, కలెక్టర్



జయపురం: గుప్తేశ్వర్ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న సీఎస్ మహాపాత్రో

కొరాపుట్: జిల్లాలో 10వేల హెక్టార్లలో కాఫీ తోటలను పెంచనున్నట్లు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేష్‌చంద్ర మహాపాత్రో ప్రకటించారు. ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద సరిహద్దు కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియాలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం 3వేల హెక్టార్లలో కాఫీ సాగు చేపడుతుండగా, రానున్న మూడేళ్లలో ఈ లక్ష్యాన్ని 10వేల హెక్టార్లకు పెంచుతామని వెల్లడించారు. గత 2రోజుల్లో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులు పరిశీలించానన్నారు. కొఠియాలో స్ట్రాబెరీ పంట ఎంతో రుచికరంగా ఉందన్నారు. ఈ పంటకు జాతీయస్థాయి మార్కెటింగ్ కల్పిస్తామని తెలిపారు. అలాగే స్థానికంగా ఇంగ్లిష్ మాధ్యమంలో ఆదర్శ విద్యాలయం ఏర్పాటుతో పాటు విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. గిరిజనులకు జీవనోపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. దేమమాలిలో ఇకో-టూరిజం అభివృద్ధి చేస్తామని, మరో 10 కాటేజీలు నిర్మిస్తామని వెల్లడించారు. బరంపురం-కొరాపుట్ మధ్య 4 లైన్ల రహదారితో గ్రీన్ కారిడర్‌ను మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. విశాఖపట్నం-రాయపూర్ మధ్య నిర్మిస్తున్న భారత మాల ప్రాజెక్టుకు 6నెలల్లో భూ సేకరణ పూర్తి చేశామని, త్వరలో ఈ రోడ్డు అందుబాటులోకి వస్తుందని వివరించారు.

పర్యాటకాభివృద్ధికి..

అప్పర్ కొలాబ్‌లో టూరిజం బోటులు ఏర్పాటు చేయడంతో పాటు కొరాపుట్ జిల్లాను పర్యాటకంలో ప్రథమ స్థానంలోకి తీసుకు వచ్చేందుకు చర్యలు చేపడతామని ప్రధాన కార్యదర్శి సురేష్‌చంద్ర పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ఏటా లక్షల సంఖ్యలో వస్తున్న పర్యటకుల సౌకర్యార్థం మరిన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. జయపురంలో ఎయిర్‌స్ట్రిప్ విస్తరణ వేగంగా చేస్తామని, పెద్ద విమానాలు దిగడానికి సౌకర్యాలు పెంచుతామని హామీ ఇచ్చారు. కొరాపుట్‌లో మెడికల్ కళాశాల, జయపురంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనాలు వేగవంతంగా నిర్మాణం జరుగుతోందన్నారు. సహజసిద్ధ క్షేత్రం గుప్తేశ్వరం అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేశామని వివరించారు. అంతకుముందు సీఎం కొరాపుట్‌లోని కాఫీ తోటల పెంపకం, శబరి శ్రీక్షేత్రం, కొఠియా, దేవమాలి, అప్పర్ కొలాబ్, గుప్తేశ్వరం, సిమిలిగుడ ప్రాంతాలలో సుడిగాలి పర్యటన చేశారు. అతని వెంట జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తార్ ఉన్నారు.

గుప్తేశ్వర్ అభివృద్ధికి చర్యలు

జయపురం: జిల్లాలో గత 2రోజులుగా పర్యటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేష్‌చంద్ర ప్రసిద్ధ శైవక్షేత్రం గుప్తేశ్వర్‌ను సందర్శించారు. ఆలయ సర్వాంగ ఉన్నతికి రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. అలాగే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించిన సీఎస్.. పూజారులు, స్థానిక ప్రముఖులతో చర్చించారు. గతంలో మందిరం వరకు రూ.రెండున్నర కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్డు, మార్కెట్ కాంప్లెక్స్, శబరీ నది ఘాట్ అభివృద్ధి పనులను పరిశీలించారు. గుప్తేశ్వర్ ఉన్నతికి చేపట్టాల్సిన పెంగింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అప్పర్ కొలాబ్ జలవిద్యుత్ ప్రాజెక్టు డ్యామ్‌ను సందర్శించారు. పర్యాటకులను ఆకట్టుకొనే విధంగా డ్యామ్ పరిసర ప్రాంతాలను తీర్చిదిద్దడంతో ఆనందం వ్యక్తం చేస్తూ ఈ ప్రాంతాన్ని ఇకో-టూరిజమ్ కేంద్రంగా మలచాలని అధికారులకు సూచించారు. పర్యటనలో కలెక్టర్ అబ్దుల్ మమ్మద్ అక్తార్, జిల్లా ఎస్పీ అభినవ సోన్‌కార్, జిల్లా పరిషత్ అభివృద్ధి అధికారి శివాజీ ఇసల్‌వార్, అదనపు కలెక్టర్ రామేశ్వర ప్రధాన్, సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గంట్యాడ: బొండపల్లి మండలం వెదురువాడగ్రామానికి చెందిన భార్యాభర్తలు రేగిడి రాము, సూర్యం రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో సూర్యం మృతి చెంగా రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. రాము సోదరి విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెను పరామర్శించేందుకు భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్లారు. ఆమెను పరామర్శించిన తర్వాత తిరిగి వెదురువాడ వస్తుండగా మండలంలోని కొర్లాం కాటా వద్ద ముందు వెళ్తున్న 18 చక్రాల ట్రాలీని రాము ఢీకొట్టడంతో ట్రాలీ చక్రాల కిందకు బైక్ వెళ్లి పోయింది. బైక్‌వెనుక ఉన్న రాము భార్య సూర్యం అక్కడికక్కడే మృతి చెందింది. రాము రెండు కాళ్లూ విరిగిపోవడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి విజయనగరం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

విజయనగరం క్రైమ్: పట్టణంలోని టూటౌన్ పరిధికి చెందిన వ్యక్తి ఆర్థిక సమస్యలు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు సీఐ సీహెచ్ లక్ష్మణ రావు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. టూటౌన్ పరిధిలో నివాసం ఉంటున్న పప్పు సంతోష్ కుమార్ (35) కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. రోజురోజుకూ సమస్యలు పెరిగిపోతుండడంతో తట్టుకోలేక ఈ నెల 24 న పురుగు మందు తాగేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళా కానిస్టేబుల్ సహృదయం



పరీక్ష కేంద్రం బయట చిన్నారిని ఆడిపిస్తున్న బసంతి చౌదరి

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కానిస్టేబుల్ ఎంపికలో భాగంగా రాత పరీక్షలు ఆదివారం జరిగాయి. ఇందులో మల్కన్‌గిరికి చెందిన మమత అనే వివాహిత తన 6నెలల చిన్నారితో సహా కేంద్రానికి చేరుకుంది. అయితే నిబంధనల మేరకు పాపను లోపలికి తీసుకు వెళ్లేందుకు అధికారులు అనుమతించలేదు. దీంతో ఏం చేయాలో తోచక కేంద్రం బయటే నిరాశగా కూర్చుండిపోయింది. బందోబస్తు నిమిత్తం అక్కడే ఉన్న మహిళా కానిస్టేబల్ బసంతి చౌదిరీ స్పందించింది. చిన్నారి సంరక్షణ చూసుకుంటానని భరోసా ఇచ్చింది. 3గంటల సమయం పరీక్ష రాసి, బయటకు వచ్చేంత వరకు చిన్నారిని లాలిస్తూ.. జాగ్రత్తగా చూసుకుంది. దీంతో బయటకు వచ్చిన మమత.. బసంతి సహృదయానికి కన్నీంటి పర్యంతమైంది. విషయం తెలుసుకున్న జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆమెను అభినందించారు.

కొత్తపేటలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తం అందిస్తున్న మహిళ

రాయగడ: పట్టణానికి సమీపంలోని కొత్తపేట సత్యసాయి బాబా సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సమితి కన్వీనర్ బి.ప్రసాద్ పట్నాయక్, డాక్టర్ గౌతం పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో 38యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వచ్ఛందంగా వచ్చి, రక్తాన్ని అందించిన దాతలను ప్రశంసించి, ప్రోత్సహించారు.

ఎక్స్‌బోర్డు పాఠశాలలో వందేళ్ల పండుగ

- హాజరైన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖామంత్రి జగన్నాథ సరక



శతధళ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగన్నాథ్ సరక

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోకి డెయిలీ మార్కెట్ వద్ద ఉన్న ఎక్స్‌బోర్డు పఠశాల స్థాపించి, వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శత వార్షికోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖామంత్రి జగన్నాథ సరక ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ మాఝి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1920లో ఓ మారుమూల పల్లెగా ఉన్న మల్కన్‌గిరిలో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఎక్స్‌బోర్డు పాఠశాలను ఏర్పాటు చేసి, ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దిందని తెలిపారు. ఇక్కడ చదువుకున్న వారు ప్రస్తుతం ఉన్నాతాధికారులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపార వేత్తలుగా వివిధ రంగాల్లో స్థిర పడ్డారని గుర్తు చేసుకున్నారు. ఇదే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చి, ఎమ్మెల్యేగా, అనంతరం మంత్రిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. 2020 నాటికే వందేళ్లు పూర్తి చేసుకున్నా.. కరోనా కారణంగా వేడుకలు జరపలేదన్నారు. ఇందులో భాగంగా శతదళ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానస్ మడకామి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారి టంగులు, రిటైర్డ్ హెచ్ఎం ప్రకాష్‌చంద్ర పట్నాయక్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కరుణించి.. కాపాడు కనకమహాలక్ష్మి

- ప్రారంభమైన శ్రీకనకమహాలక్ష్మి 25వ జాతర మహోత్సవములు
- ప్రత్యేక ఆకర్షణగా అమ్మవారి సైకత చిత్రం
- మొక్కులు సమర్పించుకున్న వేలాది మంది భక్తులు

చీపురుపల్లి:

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 25వ జాతర మహోత్సవములు వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న అమ్మవారి జాతరను తెల్లవారుజామున ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, కమిటీ సభ్యులు తొలి పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం తెల్లవారుజామున 2 గంటల నుంచి భక్తులకు అమ్మవారిని దర్శించుకునేందుకు అనుమతిచ్చారు. అప్పటికే క్యూలైన్లలో బారులు తీరి ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. విజయనగరం, విశాఖపట్టణం, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు రావి చెట్టు, ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం కోళ్లు, గొర్రెలను మొక్కుతూ, పసుపు, కుంకుమలు సమర్పించుకున్నారు.



పూజలందుకుంటున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రత్యేక ఆకర్షణగా సైకత చిత్రం

ఈ ఏడాది అమ్మవారి ఆలయం ఎదుట ఆవిష్కరింపబడిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి సైకత చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతర సందర్భంగా అమ్మవారిని సైకత చిత్రంగా రూపొందించడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఫొటోలు తీసుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

అమ్మవారిని ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి దంపతులు, డా.బొత్స సందీప్, పూజిత దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి దేవదాయ ధర్మాదాయ శాఖ ఈఓ జి.శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పట్టు వస్త్రాలు, పూజా సామగ్రి సమర్పించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతులతో బాటు వారి కుమారుడు మోహిత్, కుమార్తె సిరిసహస్ర, అల్లుడు ప్రదీప్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శ్రీదేవి దంపతులతో బాటు కుమారుడు బెల్లాన వంశీకృష్ణ, పావని దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.



పూజల్లో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అమ్మవారి సైకత చిత్రం

వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య



నిందితులను మీడియా ముందు హాజరుపర్చి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మోహనరావు

రాజాం సిటీ: రేగిడి మండలం ఉంగరాడ గ్రామానికి చెందిన గులివిందల ధనలక్ష్మి (23) వరకట్న వేధింపులు భరించలేకే ఆత్మహత్యకు పాల్పడిందని బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాజాం రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జోడుబందల గ్రామానికి ధనలక్ష్మికి గత ఏడాది ఆగస్టు 5న ఉంగరాడ గ్రామానికి చెందిన గులివిందల గౌరునాయుడితో వివాహమైంది. అప్పట్లో కట్నంగా రూ. 5.50 లక్షలతోపాటు బండి కొనుగోలుకు మరో రూ. లక్ష, బంగారం, ఆడపడుచుల కట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. అయితే కొంతకాలంగా తనను వరకట్న వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు తండ్రి గణపతిరావుకు తెలిపింది. గర్భంతో ఉన్న తనను పాలు కూడా తాగనివ్వడంలేదని చెప్పడంతో తండ్రి ప్రతి నెలా రూ. 3వేలు చొప్పున కుమార్తె ఖర్చులకు ఇచ్చేవాడన్నారు. ఈ విషయంపై మృతురాలి అత్తమామలు వారించడంతో అప్పటి నుంచి డబ్బులు ఇవ్వడం మానేశాడు. ఇదిలా ఉండగా ఈ నెల 24న బ్యాంకు పని నిమిత్తం రాజాం వెళ్లి ఇంటికి వచ్చిన ధనలక్ష్మిని భర్త గౌరునాయుడు మందలించాడు. అనంతరం తన కోళ్ల ఫారానికి కోడి పిల్లలు వస్తున్నాయని చెప్పి అక్కడికే వెళ్లి రాత్రంతా ఉన్నాడు. 25న ఉదయం గౌరునాయుడు ఇంటికీ వచ్చేసరికి ఎవరూ తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కలవారంతా వచ్చి తెరిచారు. అప్పటికే ఫ్యాన్‌కు ధనలక్ష్మి ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయి ఉంది. వరకట్న వేధింపులతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించి కేసు నమోదుచేసి, ఆమె భర్తతోపాటు మామ సూర్యనారాయణ, అత్త లక్ష్మిలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన ఫిజిక్స్ పరీక్షకు 1466 మందికిగాను 1342 మంది హాజరయ్యారు. 124మంది గైర్హాజరయ్యారు. కెమిస్ట్రీ 900 మందికిగాను 783 మంది హాజరయ్యారు. 117 మంది గైర్హాజరయ్యారు. బోటనీ 2287 మందికిగాను 2117 మంది హాజరయ్యారు. 171 మంది గైర్హాజరయ్యారు. జువాలజీకి సంబంధించి 476 మందికిగాను 446 మంది హాజరయ్యారు. 30 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఫస్టియర్ ఒకేషనల్‌కి సంబంధించి 3687 మందికిగాను 3252 మంది హాజరయ్యారు. 435 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ ఎం.సత్యనారాయణ తెలిపారు.

విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ సదస్సు గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి విశ్రాంత జిల్లా న్యాయమూర్తి మంగిపూడి రాజభూషణం అధ్యక్షత వహించారు. రంగస్థలం పౌరాణిక నాటకం అనే అంశంపై పక్కి జెడ్పీ పాఠశాల హెచ్ఎం గన్నవరపు వేంకట సూర్యనారాయణమూర్తి వక్తగా పాల్గొని ప్రసంగించారు. పౌరాణిక నాటకాల ప్రాభవాన్ని, ప్రభావాన్ని గుర్తుచేశారు.

బుడతడికి 'బుక్'లో చోటు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇచ్చిన పతకాలు, ధ్రువపత్రాలతో సంజీవ్‌రెడ్డి

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన బుడతడు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. తేతల భానుప్రకాష్‌రెడ్డి, శివానీల కుమారుడైన నాలుగేళ్ల సంజీవ్‌రెడ్డి తన సత్తా చాటి శభాష్ అనిపించాడు. సంజీవ్‌రెడ్డి 30 సెకనుల వ్యవధిలో భారతదేశంలోని రాష్ట్రాల పేర్లు, వాటి రాజధానుల పేర్లు చెప్పి కొత్త రికార్డు సాధించాడు. దీంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు సంజీవ్‌రెడ్డిని అభినందించి ధ్రువపత్రం, బంగారు పతకం, పుస్తకం – కలం బహుమతిగా అందజేశారు. సంజీవ్‌రెడ్డిని స్థానికులు, తల్లిదండ్రులు అభినందించారు.

వేడుకగా యల్లారమ్మ తొలేళ్ల జాతర



వైష్ణవిమాత ప్రత్యేక అలంకరణతో దర్శనమిస్తున్న యల్లారమ్మ అమ్మవారు

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన జామి యల్లారమ్మ జాతర తొలి రోజు తొలేళ్ల జాతర ఆదివారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న జాతరలో తొలి రోజు భక్తులు అమ్మవారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జాతరలో భాగంగా ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుద్దీపలంకరణలతో సుందరంగా ముస్తాబు చేశారు.

క్లుప్తంగా

28న వైఎస్సార్ సీపీ అత్యవసర సమావేశం



నరసన్నపేట: జిల్లా కేంద్రంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నేతల అత్యవసర సమావేశం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎంఎల్‌సీ అభ్యర్థి నర్తు రామారావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం ప్రత్యేకంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రాంతీయ సమన్వయకర్త, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు.

అగ్ని ప్రమాదంలో ఆటో దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

హిరమండలం: మండల కేంద్రంలోని చిన్నకోరాడ గ్రామంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తోనంగి తవుడుకు చెందిన గడ్డి కుప్ప, తోనంగి రమేష్‌కు చెందిన ఆటో అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

అరసవల్లిలో సప్తమి సందడి



క్యూలైన్లలో భక్తుల రద్దీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఆదివారం విశేష భక్తజనం ప్రత్యేక పూజలు చేశారు. సప్తమి పర్వదినం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పలువురు భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకోగా, ఆరోగ్యం కోసం మరికొందరు సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. అంతరాలయంలో భక్తుల కోసం స్వామివారిని ప్రత్యేక అలంకరణతో దర్శనానికి అనుమతిచ్చారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాలతో రూ.4,07,600, పూజలు, విరాళాల రూపంలో రూ.73,566, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.20 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళంలోని నాగావళి నదీ తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఒకటో పట్టణ ఎస్‌ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. హయాతి నగరం సందులోంచి నాగావళి ఏరుకు వెళ్లే దారిలో బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఎండిపోయిన కొబ్బరి డొక్కలపై ఉన్నట్లు ఆదివారం ఉదయం 6 గంటలకు సమాచారం రావడంతో పోలీసులు సంఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. హయాతినగరం వార్డు రెవెన్యూ కార్యదర్శి కె.చంద్రకిరణ్‌సింగ్ అక్కడకు వెళ్లి ఎడమ వైపు నోటి నుంచి నురగ ఉండటం, కుడి ఛాతీ పైభాగాన కె.కావేరి పేరుతో పచ్చబొట్టు ఉండటం చూశారు. మృతుడు నీలంరంగు చెక్ షర్టు ధరించి ఉన్నాడని, దూరంగా ప్యాంటు విడిచి ఉన్నాడని, 5.8 అడుగుల ఎత్తుండి, 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటుందని ధ్రువీకరించుకున్నారు. రెవెన్యూ కార్యదర్శి ఇచ్చిన స్టేట్‌మెంటు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు.

భర్తపై భార్య ఫిర్యాదు

కొత్తూరు: తన భర్త నిత్యం వేధిస్తున్నాడని మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీ (ఇరపాడు)కి చెందిన మడపాన మహాలక్ష్మి ఫిర్యాదు చేసినట్టు పోలీసులు ఆదివారం తెలిపారు. టెక్కలికి చెందిన తన భర్త సుదర్శన అదనంగా కట్నం తీసుకురావాలంటూ నిత్యం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవిందరావు చెప్పారు.

యాంత్రీకరణ వైపు సాగుతూ..



- వ్యవసాయ పనుల్లో యంత్రాలను వినియోగించేలా రైతుల్లో అవగాహన
- అద్దెకు యంత్రాలు

కేవీకే ప్రధాన శాస్త్రవేత్త: కె.భాగ్యలక్ష్మి

ఆమదాలవలస: రైతులు ఇప్పటికీ పాత పద్ధతుల్లోనే పంటల సాగు, వ్యవసాయ పనులు చేస్తున్నారు. దీంతో వారికి ఖర్చుతోపాటు సమయం కూడా వృథా అవుతోంది. సకాలంలో పనులు పూర్తి చేసుకోలేక పంటలను కూడా నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి అన్నదాతను ఆదుకునేలా కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు కృషి చేస్తున్నారు. యాంత్రీకరణ వినియోగం వైపు దృష్టిసారించేలా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం అద్దె ప్రాతిపదికన యంత్రాలను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటలుగా వరి, మొక్కజొన్న, వేరుశెనగ, చెరుకును అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తగినంతమంది కూలీలు లభ్యత కావడం లేదు. దీనికితోడు కూలీలపై పెట్టే ఖర్చు రైతుకు భారంగా మారుతోంది. ఇలాంటి తరుణంలో వ్యవసాయ యాంత్రీకరణ విధానం అవసరమని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు యంత్ర పరికరాలు అందించేందుకు చర్యలు చేపడుతోంది. యంత్ర పరికరాల వినియోగంపై కేవీకే ప్రతినిధులు రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే అద్దె ప్రాతిపదికన యంత్ర పరికరాలను అందిస్తున్నారు.

అంతరకృషి పరికరం



ఇది రెండు రకాలుగా ఉంటుంది. ఆ పరికరం కూరగాయలు, వరుసల్లో వేసిన మొక్కజొన్న, చెరుకు, పత్తి వంటి పంటల్లో అంతరకృషి చేసుకోటానికి అనువుగా ఉంటుంది. కూలీలపై పెట్టే ఖర్చు 50 శాతం వరకు తగ్గుతుంది. కలుపు సమర్థవంతంగా నివారించబడటమేకాకుండా భూమి గుల్ల బారుతుంది.

చాప్‌కట్టర్ (స్ప్రెడ్డర్)



మొక్కజొన్న, చెరుకు తదితర పంటలు కోత అనంతరం మిగిలిన గడ్డిని రెండించీలు వరకు ముక్కలు చేస్తుంది. దీనిని కంపోస్టుగా వాడుకోవచ్చు. ఎండిన కొబ్బరి ఆకులు, ఆయిల్ ఫామ్‌ను కూడా ముక్కలుగా కట్ చేసుకోవచ్చు. దీనిని రోజుకు రూ. 500 లేదా గంటకు రూ. 100 అద్దెకు అందుబాటులో ఉంటుంది.

పొలం తయారీ పరికరం (రోటావేటర్)



పొలం దున్నడానికి, దమ్ము చేయడానికి వినియోగించవచ్చు. దీంతో పొలం మెత్తగా దున్నడం.. చదును చేసుకోవచ్చు. ఎకరా దుక్కి చేయడానికి రూ. 100, ట్రాక్టర్‌తో కలిపి ఎకరానికి రూ. 1000 అద్దెకు ఇస్తారు. చివరు దుక్కి, దమ్ము రోటావేటర్‌తో చేయడం వలన పొలం చదునుగా ఉండి నీటి యాజమాన్యం సులువు అవుతుంది.

వరికోత యంత్రం (ప్యాడీ రీపర్)



దీంతో రోజుకు మూడు ఎకరాలను కోత కోసుకోవచ్చు. ఎకరానికి రూ. 1800 నుంచి రు.2000 వరకు అవుతుంది. కోత కోసిన చేను త్వరగా ఆరుతుంది. వరి మాగానుల్లో పెసర మినుము వేసే ప్రాంతాలకు అనువుగా ఉంటుంది.



నాట్లు వేసే యంత్రం

ఈ యంత్రంతో వరినాట్లు వరసల్లో వేసుకోవచ్చు. రోజుకు 5 నుంచి ఆరు ఎకరాల్లో నాట్లు సూనాయాసంగా వేయవచ్చు. పంట దిగుబడి 20 నుంచి 25 శాతం వరకు పెరుగుతుంది. ఈ పద్ధతిలో నాట్లు వేస్తే ఎకరానికి 15 కిలోలు విత్తనాలు మాత్రమే సరిపోతాయి. ఈ యంత్ర పరికరాన్ని రూ. 600 అద్దెకు ఇస్తారు. ట్రాక్టర్‌తో పాటు తీసుకొని వెళ్తే ఎకరాకు రూ. 3,600 చెల్లించాలి.

విత్తనాలు విత్తే యంత్ర పరికం



ఈ యంత్రంతో ఎరువు, విత్తనం ఒకేసారి వేసుకోవచ్చు. దీనిద్వారా విత్తనాలను పంటను బట్టీ నిర్ణీత దూరంలో వేయడం వలన గాలి, వెలుతురు సక్రమంగా తగిలి పంట ఆరోగ్యంగా పెరుగుతుంది. విత్తనంతోపాటుగా భాస్వరం ఎరువులు వేయడం వల్ల వేరు వ్యవస్థ అభివృద్ధి జరిగి దిగుబడి పెరుగుతుంది. వరిలాంటి పంటలు నేలకొరగకుండా దిట్టంగా ఉంటాయి. రోజుకు ఆరు నుంచి ఎనిమిది ఎకరాల వరకు ఈ యంత్రంతో విత్తుకోవచ్చు. ఈ పరికరాన్ని ఎకరాకి వంద రూపాయలు లేదా రోజుకు రూ. ఐదు వందల ప్రాతిపదికన అద్దెకు కేవీకే సిబ్బంది ఇస్తున్నారు.

వరి నూర్పిడి యంత్రం

గంటకు ఎకరా చేను వరకు నూర్పిడి చేసుకోవచ్చు. గంటకు రూ. 750 ఖర్చు అవుతుంది. రోజుకు సుమారు 8 ఎకరాల వరకు చేను నూర్పిడి చేయవచ్చు. ఇది అద్దెకు రోజుకు రూ. 500 లేదా ఎకరానికి రూ. 100 చెల్లించి అద్దెకు తీసుకోవచ్చు



నేడు జామి ఎల్లమ్మతల్లి జాతర



ఎల్లమ్మతల్లి గుడి

మందస: మూలిపాడు పంచాయతీ పరిధి గోపాలపురం-శ్రీనివాసపురం గ్రామాల్లో జామి ఎల్లమ్మతల్లి 131వ జాతర బుధవారం జరగనుంది. మహాశివరాత్రి అనంతరం ఈ జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలకు సంబంధించి మంజూష (మందస) కేంద్రంగా రాజులు పరిపాలించేవారు. అప్పట్లో ఈ ప్రాంతంలో తెల్లని నాగుపాము సంచరించేదని.. ఇది ఎవరికీ హానీ తలపెట్టకుండా ప్రస్తుతం ఉన్న పుట్టలోకి వెళ్లి, వస్తుండేదని పూర్వీకులు చెబుతుంటారు. కొంతకాలం తరువాత నాగుపాము క్రమేపి అంతర్ధానమైందని దీంతో ఈ పుట్టవద్ద మందస రాజులు 1890వ సంవత్సరంలో ఆలయం నిర్మించారని చెబుతున్నారు. రాజా శ్రీనివాసరాజమణిదేవ్ హయాంలో జామి యాత్ర వైభవంగా జరిగేది. అప్పటి నుంచి గుడి వద్ద యాత్ర జరుగుతోంది. ముడుపులు ఆలయంపైకి విసిరితే భక్తులు కోరిన కోర్కెలను ఎల్లమ్మతల్లి తీర్చుతుందని భక్తుల నమ్మకం. మందస, సోంపేట, కంచిలి, పలాస మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఎల్లమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఉదయం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు విశేషపూజలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. యాత్ర సందర్భంగా పలు సాంస్కృతిక, ఆధ్మాత్మిక కార్యక్రమాలు ఉంటాయని సర్పంచ్, ఉపసర్పంచ్‌లు గుసిరి వెంకటరావు, రామచంద్రమహంతి తెలిపారు.



భక్తులు పూజించే పుట్ట

దేశ సేవలో తండ్రీ కుమారుడు



తండ్రి వాసుదేవరావు చేతుల మీదుగా కెప్టెన్ బ్యాడ్జి పొందుతున్న కుమారుడు ఆర్మీ డాక్టర్

మందస: మూడు దశాబ్దాలుగా దేశ సేవ చేస్తున్న తండ్రి తన వారసుడిని కూడా తన బాటలోనికే తీసుకువచ్చారు. ఆయన చేతులమీదుగానే కుమారుడు ఆర్మీలో బాధ్యతలు అందుకోవడం మరీ విశేషం. వివరాల్లోకి వెళ్తే.. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన పందిరి వాసుదేవరావు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో 1993లో చేరి పనిచేస్తున్నారు. ఇన్నేళ్లుగా దేశసేవలో తరిస్తున్న ఆయన ఇప్పుడు తన కుమారుడిని కూడా ఆర్మీలోనే చేర్చారు. వాసుదేవరావు, ఈశ్వరి దంపతులు తమ కుమారుడు తేజేశ్వరరావును ఎంబీబీఎస్ చదివించారు. ఇతను మార్చిలో పీజీ పరీక్ష రాయాల్సి ఉంది. కానీ ఆర్మీలో వైద్యునిగా పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంతో అటు వైపే వెళ్లారు. ఇటీవలే ఉత్తర్వులు అందడంతో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో గల ఆర్మీ బేస్ ఆస్పత్రిలో డాక్టర్‌గా నియమితులయ్యారు. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బీఎస్‌ఎఫ్‌లో హెచ్‌సీగా పని చేస్తున్న వాసుదేవరావు చేతుల మీదుగానే తేజేశ్వరరావు కెప్టెన్ ర్యాంక్ త్రీస్టార్స్ బ్యాడ్జి అందుకున్నారు. తండ్రి చేతులమీదుగా ఆర్మీలో బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందని తేజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా తేజను మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ బొడ్డు శాంతిప్రియ, వైఎస్సార్ సీపీ నాయకుడు ఉదయ్(ఉమాపతి) తదితరుల ఆధ్వర్యంలో సన్మానించారు.



ఆర్మీ డాక్టర్ తేజేశ్వరరావు సన్మానిస్తున్న ఎంపీపీ దొక్కరి దానయ్య, ఇతరులు


ఎస్పీ చొరవతో..



ఎస్పీ ఆదేశాలతో మెడికవర్ ఆస్పత్రిలో దగ్గరుండి వైద్య చికిత్స చేయిస్తున్న టూటౌన్ ఎస్‌ఐ వెంకటేష్

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ జీఆర్ రాధిక మానవత్వాన్ని చాటుకున్నారు. ఆమె చొరవతో ఓ క్షతగాత్రుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం పడిమి సూర్య అనే యువకుడు పని కోసం తుని‌కు వెళ్లడానికి ఆమదాలవలసలో విశాఖ ఎక్స్‌ప్రెస్ అనుకుని కదులుతున్న సూపర్ ఫాస్ట్ రైలు ఎక్కి దిగే క్రమంలో జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు ప్రథమ చికిత్స కోసం తరలించారు. అప్పటికే యువకుడు అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ రాధిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌ఎస్‌ఐ వెంకటేష్‌ను ఆస్పత్రికి పంపించి యువకుడికి సరైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎస్‌ఐ రిమ్స్‌కు వెళ్లి అక్కడ వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఎస్పీ ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి సరైన వైద్యం అందించాలని సూచించారు. ఎస్పీ చొరవతో తమ కుమారుడు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడని ఆమెకు రుణపడి ఉంటామని యువకుని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం



రవీంద్ర బెహరా



దిలీప్ బెహరా

ఇచ్ఛాపురం రూరల్: మండలం ఈదుపురం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైనట్లు ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. గ్రామానికి చెందిన చొబ్బి బెహరా కుమారుడు రవీంద్ర బెహరా(16), అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్ బెహరా కుమారుడు దిలీప్ బెహరా(14)లు స్థానిక కంద్ర వార్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10, 9 తరగతులు చదువుతున్నారు. ఈ నెల 24న శుక్రవారం ఉదయం వీరు బడికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అదే రోజు రాత్రి, శనివారం సాయంత్రం వరకు చుట్టుపక్కల గ్రామాల్లో బంధువుల ఇళ్లలో వాకబు చేశారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం సాయంత్రం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక రూరల్ ఎస్‌ఐ కె.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులు చెబుతుండగా, తమ పిల్లలు పాఠశాలకు వెళ్లి అక్కడి నుంచే అదృశ్యమయ్యారని తల్లిదండ్రులు చెబుతున్నారు.

రాజమ్మ తల్లి జాతరకు పోటెత్తిన భక్తులు



రాజమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

గార: వత్సవలసలో కొలువైన రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి భక్తులు నాల్గో ఆదివారం పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా జనం తరలి రావడంతో రోడ్లు, వీధులన్నీ కిక్కిరిశాయి. శనివారం రాత్రికి వచ్చిన భక్తులు బస చేసి ఆదివారం వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలాచరించారు. కుటుంబ సమేతంగా విచ్చేసి ఇక్కడే వంటలు చేసుకొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఎం. మధుసూదన రావు పర్యవేక్షించారు.

సజావుగా ఇంటర్ ప్రాక్టికల్స్

- మొదటి విడతలో 78 కేంద్రాల్లో మొదలైన ప్రాక్టికల్స్
- తొలిరోజు 6088 మందికిగాను 161 మంది గైర్హాజరు



శ్రీకాకుళంలోని శ్రీచైతన్య కళాశాలలో సీఎస్‌లు, డీఓలతో ఏర్పాట్ల గురించి మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు డి.గోపాల్‌రెడ్డి.



శ్రీకాకుళలోని ఓ ప్రైవేటు కళాశాల కేంద్రంలో ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఆదివారం మొదలయ్యాయి. మొత్తం 134 కేంద్రాలకుగాను మొదటి విడతగా 78 కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు తొలిరోజు 6,088 మంది హాజరుకావాల్సి ఉండగా 5,927 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 161 మంది గైర్హాజరయ్యారు. ఉదయం పూట 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 3,486 మంది హాజరుకావాల్సి ఉండగా 3,379 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పరీక్షలకు 2,602 మంది హాజరుకావాల్సి ఉండగా 2,548 మందిహాజరయ్యారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసు లు నమోదు కాలేదని అధికారులు ధ్రువీకరించారు.

రాష్ట్ర పరిశీలకులు హాజరు..

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాక్టికల్స్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. పరీక్ష కేంద్రాలపై పూర్తిస్థాయిలో నిఘాపెట్టేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఇంటర్ బోర్డు నుంచి రాష్ట్ర పరిశీలకుడిగా హాజరైన డి.గోపాల్‌రెడ్డి పలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళం నగరంలోని నారాయణ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల, ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, రణస్థలంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలల్లో పరీక్షలు జరుగుతున్న తీరు, ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులతోను, అక్కడి సీఎస్‌లు, డీఓలతో మాట్లాడారు. అలాగే జిల్లా ఆర్‌ఐఓ ఎస్.తవిటినాయుడు జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలకు చేసిన ఏర్పాట్లను పరిశీలకులు గోపాల్‌రెడ్డికి వివరించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలతో ఏర్పాటు చేసిన స్ట్రీమింగ్ ద్వారా ఏర్పాట్లను, పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

తనిఖీల హోరు..

జిల్లాలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో తొలిరోజు అధికారులు తనిఖీలతో హోరెత్తించారు. ఆర్‌ఐఓ ఎస్.తవిటినాయుడు శ్రీకాకుళంలోని శ్రీ ఆదిత్య జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల తదితర కేంద్రాలను పరిశీలించారు. శ్రీకాకుళంలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజ్ బాలురు ఏ, బీ కేంద్రాలు, శ్రీకాకుళం ప్రభుత్వ బాలురు, ఎస్ఆర్ జూనియర్ కళాశాల సింగుపురం, పద్మావతి జూనియర్ కళాశాల నరసన్నపేట తదితర కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. హైపవర్ కమిటీ, డీఈసీ కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వేరువేరుగా విడిపోయి 60 కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

ఖాతా నుంచి రూ.41వేలు మాయం

సారవకోట: మండలంలోని అన్నుపురం గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి తన ఖాతా నుంచి రూ.41 వేలు పోగొట్టుకున్నారు. బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం.. హిరమండలం మండలం తంప గ్రామానికి చెందిన బలగ రేణుకకు సైబర్ నేరగాళ్ల ఫోన్ చేసి తాము వైద్య శాఖ నుంచి మాట్లాడుతున్నామని మీ నాన్న గతంలో గుండె ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ ద్వారా చేసుకున్నారని, దానికి సంబంధించి బీమా సొమ్ము అందిస్తామని చెప్పారు. అయితే ఆ డబ్బులు ఖాతాలో పడాలంటే కనీసం అకౌంట్‌లో రూ.2వేలు ఉండాలని సూచించారు. అయితే తన వద్ద అంత సొమ్ము లేదని చెప్పి తన సోదరి అన్నుపురం గ్రామానికి చెందిన గొర్లె నాగమ్మకు ఫోన్‌లో విషయం చెప్పింది. ఆమె కూడా తన ఖాతాలో డబ్బులు లేవని, ఆ గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త ఎడ్ల లక్ష్మికాంతమ్మకు చెప్పింది. ఆమె అకౌంట్లో డబ్బులు ఉండడంతో బీమా సొమ్మును తన ఖాతాకు జమచేయాలని లక్ష్మికాంతమ్మ కాల్ కాన్ఫరెన్స్ ద్వారా సైబర్ నేరగాళ్లకు వివరాలు చెప్పేసింది. దీంతో వారు ఓ లింక్‌ను పంపించారు. దానిపై టచ్ చేయగానే ఆశ కార్యకర్త ఖాతా నుంచి రూ.41వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో ఆమె నిర్ఘాంతపోయింది. వెంటనే స్థానిక మహిళా పోలీసులకు సమాచారం ఇచ్చి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దళితుల ఇంటికి దారేది..?



దళితులు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతంలో మట్టి వేసిన టీడీపీ నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: ఏళ్ల తరబడి దళితులు ఉపయోగిస్తున్న దారిపై మట్టి వేసి టీడీపీ నాయకులు రాక్షసానందం పొందుతున్నారు. మండలంలోని మశాఖపురం గ్రామం దళితవాడకు ఆనుకుని శివాలయం ఉంది. ఆలయం ప్రహరీ నిర్మాణం, నవ గ్రహాల ఆలయ నిర్మాణం పేరుతో స్థానిక సర్పంచ్ కుమారుడు, టీడీపీ నాయకుడు ఆశి మాధవరావురెడ్డి ఆధ్వర్యంలో కొంత మంది టీడీపీ నేతలు దళితుల ఇళ్ల ముందు దారిని మూసివేసేందుకు సిద్ధమయ్యారు. దళితులు ప్రతిఘటించడంతో వారిపై జులుం ప్రదర్శించేందుకు కూడా వెనుకాడలేదు. నవగ్రహాల ఆలయం నిర్మిస్తుండటంతో వాస్తు దోషం వల్ల దళితుల అంగడిని పూర్తిగా మూసివేస్తున్నామని, పెరటి నుంచి రహదారి చేసుకోవాలని, లేకుంటే తమ ఆగ్రహానికి గురవ్వక తప్పదంటూ హెచ్చరించారు. దీంతో దళితులు పటాన గంగమ్మ, రఘునాథ్ పటాన, హేమావతి పటాన, పార్వతి పటాన, ధనలక్ష్మీ పటాన, సరస్వతి పటాన, పురుషోత్తం పటాన, పటాన భగవాన్‌లు ఇటీవల స్థానిక రూరల్ పోలీసులను ఆశ్రయించారు. మాపైనే ఫిర్యాదు చేస్తారా.. అంటూ టీడీపీ నాయకులు ఆగ్రహించి ఏకంగా దళితులు రాకపోకలు సాగించే రహదారిని మట్టితో కుప్పలుగా నింపేశారు. దీంతో కనీసం మంచినీటి బోరు దగ్గరకు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో శనివారం రూరల్ ఎస్‌ఐ కె.రామకృష్ణ దళితవాడను సందర్శించి నిర్మాణాలు నిలిపివేయాలని, దళితులు రాకపోకలు సాగించేందుకు రహదారి ఇవ్వాలంటూ టీడీపీ నాయకులకు సూచించారు. ఎస్‌ఐ వద్ద ఒప్పుకున్న ఆ నాయకులు ఆదివారం మళ్లీ పనులు ప్రారంభించడం విశేషం. అదే గ్రామం చివర్లో జగనన్న కాలనీలో నిరుపేదల ఇళ్లు నిర్మిస్తుంటే ఇదే టీడీపీ నాయకులు పచ్చని చెట్లు ఉన్నాయంటూ ఇంటి నిర్మాణాలను గతంలో అడ్డుకున్నారు.